# తిండిగింజలు

బస్సు వంతెన మీదికి వచ్చింది. వంతెన కింది కాలువలో నీళ్ళు చప్పుడు చేస్తూ ప్రవహిస్తున్నాయి. కాలువ గట్టుమీద పచ్చగడ్డి పెరిగుంది.

కళ్ళు విప్పార్చుకుని చూశాడు సూర్యానారయణ. ఇంతకుముందు ఆ కాలువగట్టుమీద రెండెద్దుల చక్రాల బండ్లూ, టైరు బండ్లూ వెళ్ళటానికి పచ్చగడ్డి పైన ఎర్రటి మట్టిదారి, దాని మధ్యలో కాలిబాట ఉండేవి. ఇప్పుడు అవేవీ కనపడటం లేదు. అంతటా గడ్డి పెరిగి దారి మూసుకుపోయింది. అంటే ఆ గట్టుమీద పొలాలకు రాకపోకలు లేవని అనిపిస్తోంది. సూర్యనారాయణకు ఆశ్చర్యమనిపించింది. కాలువ దాటిన దగ్గర నించీ తన ఊరి పొలాలు మొదలవుతాయి.

వంతెన దాటిన తర్వాత గతుకులుగా వున్న రోడ్డుమీద వెళుతుంది బస్సు. కిటికీవారగా కూర్చున్న సూర్యనారాయణరావు చూపు ఆనినంత మేర చూశాడు. రోడ్డుకు రెండువైపులా ఎక్కడా పొలాల్లో పచ్చదనం లేదు. పొలాల్లో పైర్లు లేవు. బోసిగా వున్నాయి పొలాలు. ఎండిపోయిన మట్టి నల్లగా అగుపడుతోంది.

పచ్చగా ఉండాల్సిన పొలాలు ఏమైనాయి? పొలాలన్నీ బీడు పెట్టినట్టు ఎందుకున్నాయి? కనీసం ఒక్క పొలంలో కూడా పైరు లేదు. పచ్చదనం లేదు.

అక్కడినించి మూడు మైళ్ళు వెళితే తను వెళ్ళవలసిన తన ఊరు వస్తుంది. ప్రతి సంవత్సరం వస్తున్నట్టుగానే రైతు రాజయ్య హైదరాబాద్‌లో వుంటున్న తన ఇంటికి ఈసారి కూడా వచ్చినట్లయితే సూర్యనారాయణ ఇప్పుడు ఈ పల్లెటూరికి రావలసిన అవసరం వుండేది కాదు. కానీ రాజయ్య ఎందువల్లనో ఈసారి క్రమం తప్పి రాలేదు. కారణం తెలియదు .

సూర్యనారాయణకు రోడ్డుపక్కన పైర్లు లేకుండా బీడువారిన ఆ పొలాలను చూస్తుంటే అంతా అయోమయంగా వుంది. ఏం జరిగింది? పొలాల్లో పైరు ఉండాల్సిన సమయంలో పైర్లు ఎందుకని లేవు? రైతులంతా వ్యవసాయం చెయ్యటం మానుకున్నారా?

బస్సుతోపాటు సూర్యనారాయణ ఆలోచనలు కూడా ప్రయాణం చేస్తున్నాయి.

బస్సు మలుపు తిరిగింది. పొలాల మధ్యనించి వెళుతుంది. వేగంగా వెళుతున్నబస్సు వెనక పొగ లాంటి దుమ్ము పైకి లేస్తోంది. ఇంకొంచెం వెళితే ఆ పైనించి వచ్చిన కాలువ వంపు తిరుగుతుంది. మళ్ళీ దానిమీద చిన్న వంతెన. ఆ వంతెన దాటితే తన ఊరు.

చూస్తుండగానే వంతెన దగ్గరకు వచ్చింది బస్సు. కాలువలో అంతగా నీళ్ళు లేవు. ఆ వంతెన పక్కనే రోడ్డుకు ఎడమవైపున తన పొలాలు వున్నాయి. అయిదు ఎకరాల సారవంతమైన వరి పండే భూమి. ఒకప్పుడు అదంతా తనదే. కానీ ఇప్పుడు కాదు. తన భూమిని కౌలుకు తీసుకున్న రైతు రాజయ్య నాలుగేళ్ళ క్రితం కొనుక్కున్నాడు. ఇప్పుడా పొలం రాజయ్యది.

బస్సు తన పొలం దగ్గరకు వచ్చేసరికి సూర్యనారాయణకు ఆత్రుత హెచ్చి కళ్ళు పెద్దవి చేసి చూశాడు. అయిదెకరాలూ ఖాళీగా వుంది. పంట లేదు. బోసిగా వుంది. అతినికి మతిపోయినట్టుగా అనిపించింది.

ఎవరో మాంత్రికుడు తన మంత్రశక్తితో పొలాల్లోని పంటలన్నింటినీ మాయం చేసినట్టుగా వుంది. కాలువలో నీళ్ళున్నాయి. వర్షాలు పడుతూనే వున్నాయి. కానీ పొలాల్లో సేద్యం లేదు. ఎందువల్లనో తెలీదు. రాజయ్యను అడిగి తెలుసుకోవాలనుకున్నాడు సూర్యనారాయణ.

నాలుగేళ్ళక్రితం వరకూ సూర్యనారాయణ ఆ పల్లెటూళ్ళోనే వుండేవాడు. ఆయన కొడుకు సత్యమూర్తికి హైదరాబాద్‌లో ఒక కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. అప్పుడు తన పొలాన్ని కౌలుకు చేసే రాజయ్యకు అమ్మి కొడుకుతోపాటు తన కుటుంబాన్ని హైదరాబాద్‌కు తరలించాడు.

అప్పటినించి రాజయ్య తన పొలంలో పండిన కొంత వరి ధాన్యాన్ని పొలం గట్లమీద పెరిగిన కూరగాయలను ప్రతి సంవత్సరం హైదరాబాద్‌కు తీసుకువచ్చి ఇస్తున్నాడు. కానీ ఈసారి ఎందువల్లనో అలా తీసుకురాలేదు. కారణం తెలీక సూర్యానారాయణ విషయం తెలుసుకోవాలని ఆ పల్లెటూరికి బయల్దేరాడు.

తీరా ఇక్కడ చూస్తే పొలాలన్నీ పంటల్లేకుండా ఉన్నాయి. ఒక పంట కోశాక రెండో పంట వేస్తారు. కానీ ఎక్కడా పైరు తాలూకు పచ్చదనం అనేదే లేదు.

సూర్యనారాయణ ఆలోచనల్లో ఉండగానే బస్సు ఊళ్ళోకి చేరి సెంటర్లో మర్రిచెట్టు కింద ఆగింది. అదే చివరిస్టాపు. అంతా దిగుతున్నారు. సూర్యనారాయణ కూడా చిన్న సంచీతో బుస్సులోనించి దిగాడు.

మర్రిచెట్టు ఎదురుగా వున్న రోడ్డుమీద తిన్నగా వెళితే వేణుగోపాలస్వామి గుడి వస్తుంది. గుడి వెనుకగా మంచినీటి చెరువు. చెరువు కట్టమీద రామమందిరం పక్కనే రైతు రాజయ్య వుండే పెంకుటిల్లు. అక్కడికి కొంచెం దగ్గరగానే వుంటుంది.

సూర్యనారాయణకు దారిలో శ్రీరాములు కనిపించి పలకరించాడు. శ్రీరాములు ఆ ఊరివాడే. అక్కడే కిరాణాషాపు నడుపుతున్నాడు.

"రాజయ్య ఊళ్ళో వున్నాడా?" అడిగాడు సూర్యనారాయణ, శ్రీరాములును.

"ఉన్నాడండి..గంటక్రితమే కనిపించి మాట్లాడాడు" అని చెప్పాడు శ్రీరాములు.

సూర్యనారాయణ వెళ్ళేసరికి రాజయ్య ఇంట్లోనే వున్నాడు. పంచలో నులకమంచం మీద పడుకుని పైకి చూస్తున్నాడు. అడుగుల చప్పుడు విని తల తిప్పిన రాజయ్య ఆశ్చర్యపడ్డాడు. సూర్యనారాయణను చూసి సాదరంగా ఆహ్వానించాడు నవ్వు మొహంతో. లోపల వున్న భార్యను కేకేశాడు, సూర్యనారాయణ చేతిలో వున్నసంచీని అందుకుని లోపల పెడుతూ.

రాజయ్య భార్య మాలక్ష్మి బయటకొచ్చి సూర్యనారాయణను పలకరించి ఇంటిముందు వున్న సిమెంటు తొట్టెలోని నీటిని ఇత్తడి చెంబుతో ముంచి కాళ్ళు కడుక్కోటానికి ఇచ్చింది. సూర్యనారాయణ కాళ్ళు కడుక్కుని లోపలకు వచ్చి నులకమంచంమీద కూర్చున్నాడు. ఎండనపడి వచ్చాడని మాలక్ష్మి పెద్ద స్టీలు గ్లాసుతో సూర్యనారాయణకు మజ్జిగ ఇచ్చింది.

మజ్జిగ తాగిన తర్వాత సూర్యనారాయణ ఇక వుండబట్టలేక తన మనసులో మాటను బయటపెట్టాడు.

"రాజయ్యా! మమ్మల్ని మరచిపోయావా? హైదరాబాద్ రానే లేదు" అని అన్నాడు.

అప్పుడు రాజయ్య చిన్నగా నవ్వి ఒట్టి చేతులతో ఎందుకయ్యా హైదరాబాద్ రావటం? అందుకే రాలేకపోయాను" అన్నాడు.

"ఒట్టి చేతులతోనా? పంట చేతికి రాలేదా?" ఆశ్చర్యంతో అడిగాడు సూర్యనారాయణ.

"అసలు పంట వెయ్యలేదు బాబుగారూ! వ్యవసాయం చెయ్యలేదు. పొలాన్ని బీడు పెట్టాం" అని మెల్లగా ఒక్కో విషయం చెప్పాడు రాజయ్య.

సూర్యనారాయణకు ఆ మాటలతో మతిపోయింది.

"ఎందుకని?" అడిగాడు తేరుకుని.

రాజయ్య వెంటనే జవాడు చెప్పలేదు. ఏదో ఆలోచిస్తూ అలా వుండిపోయాడు.

"మీకెలా చెప్పాలో తెలీటం లేదు" అన్నాడు రాజయ్య. చివరకు మాటలను పెగుల్చుకుని–

"ఎలాగో చెప్పు రాజయ్యా! నాకేమీ అర్థం కావటం లేదు. బస్సులో వస్తూ చూశాను. ఒక్క పొలంలో కూడా పైరు లేదు. మాగాణి పంటలూ, మెట్టపంటలూ ఏమైనాయి?" ఆత్రుతగా అడిగాడు సూర్యనారాయణ.

"డబ్బు సంపాదన వ్యామోహానికి బలైపోయాయి" అన్నాడు రాజయ్య.

"వివరంగా చెప్పు రాజయ్యా!" అని అడిగాడు.

"చెబుతాను. ఒకప్పుడు నాకు తెలిసి మా తాత వ్యవసాయం చేసేవాడు. ఆయన ముసలివాడయ్యాక నా తండ్రి ఆ వ్యవసాయాన్ని కొనసాగించాడు. నా తండ్రికి వయసుడిగాక ఒక రైతు బిడ్డగా ఆ వ్యవసాయాన్నే వృత్తిగా నేను స్వీకరించాను.

కానీ ఇప్పుడు నేను ముసలివాడనయ్యాను. వ్యవసాయం చేసే ఓపిక లేదు. ఈ మధ్య నా ఆరోగ్యం కూడా దెబ్బతిన్నది. వ్యవసాయం చేస్తేనే గానీ ఇల్లు గడవని పరిస్థితి నాకు లేదు. మీకు తెలుసు గదా...మా అబ్బాయి రఘునాథ్ అమెరికాలో డాక్టరు ఉద్యోగం చేస్తున్నాడు. డాక్టరు కోర్సు చదివి వాడు వ్యవసాయం చెయ్యడు కదా...వాడు అక్కడ బాగా సంపాదించి ఇక్కడ వున్న నాకు డబ్బు పంపిస్తున్నాడు.

నిజానికి ఈ వయసులో నాకు కష్టపడాల్సిన అవసరం లేదు. అందువల్ల నాకు ఓపిక లేదనే మిషతో నా కొడుకు సలహాపై వ్యవసాయం చెయ్యలేదు. పొలం మొహాన్ని చూడలేదు. ఏదైనా అవసరం, జరుగుబాటు మనల్ని ఏ పనినైనా చేయిస్తాయి. ఇప్పుడు ఆ రెండూ నాకు అవసరం లేనివి" అన్నాడు రాజయ్య.

"మరి పొలాలన్నీ ఖాళీగా వున్నాయి కదా!" తన సందేహాన్ని బయటపెట్టాడు సూర్యనారాయణ.

రాజయ్య నవ్వి "ఈ ఊళ్ళో దాదాపుగా చాలామంది పరిస్థితులు ఈ విధంగాన వున్నాయి. మండల కేంద్రాల్లో కూడా కార్పొరేట్ కాలేజీలు వెలిశాయి. ఆ కాలేజీల్లో చదివిన రైతులు పిల్లలు ఈ పల్లెటూళ్ళో వుండి వ్యవసాయం చెయ్యటానికి ఇష్టపడడం లేదు. మంచి జీతాలొచ్చే ఉద్యోగాలవైపు మొగ్గు చూపిస్తున్నారు.

ఈ ఊరి వాళ్ళ పిల్లలు పదమూడుమంది అమెరికాలో రకరకాల ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంకో పదిమంది ఇతర దేశాల్లో వున్నారు. మరికొంతమంది పిల్లలు బెంగళూరులో, హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఉద్యోగం చేస్తున్నారు. వాళ్ళందరికీ చాలా పొలం వుంది. వాళ్ళంతా వాళ్ళ పొలాలను బీడు పెట్టారు. వ్యవసాయాన్ని వదిలేశారు. ఎద్దులనీ, టైరు బండ్లనీ అమ్మేశారు. దాదాపుగా వ్యవసాయాన్ని మరచిపోయేట్టున్నారు"

సూర్యనారాయణ భయంతో ఒణికిపోయాడు.

ఏమిటీ పరిస్థితి? వ్యవసాయం ఆగిపోతే జనానికి తిండిగింజలు ఎలా? ఆహారం సంగతేమిటి? పశువులకు ఏడాదంతా మేత ఎక్కడినుండి వస్తుంది.

ఉద్యోగ వ్యామోహంలో వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తే జనం ఏమయిపోతారు? వీళ్ళ తిండి మాటయేమిటి? ఏం తింటారు? ఎలా బతుకుతారు?

"మరి పొలాన్ని కౌలుకు చేసేవాళ్ళు ఎవరూ లేరా?" అడిగాడు సూర్యనారాయణ.

వాళ్ళ పరిస్థితి కూడా మారిపోయింది. మిగిలిన వాళ్ళని చూసి వాళ్ళు కూడా పంటలు బాగా పండటంతో డబ్బు కూడబెట్టి పిల్లల్ని బాగా చదివించారు. ఉద్యోగాలొచ్చాయి. పిల్లలతోపాటు పట్నాలకి, నగరాలకీ వెళ్ళిపోయి బతుకుతున్నారు. వ్యవసాయ కూలీలు కూడా పట్నవాసపు జీవితానికి అలవాటుపడి అక్కడే ఏదో ఒక

పని చేసుకుని బతుకుతున్నారు. ఇహ వ్యవసాయం ఆగిపోయినట్టే. ఇది ఈ ఒక్క ఊరి పరిస్థితి కాదు. అన్ని పల్లెటూళ్ళూ ఇట్లాగే ఉన్నాయి. ప్రభుత్వం కూడా ఈ విషయం గురించి పట్టించుకోవటం లేదు.

రకరకాల ఫ్యాక్టరీలుపెట్టి నిరుద్యోగ సమస్యను తీరుస్తున్నట్టుగా చెబుతుంది గానీ, వ్యవసాయం ఉద్యోగాల దెబ్బకు అణగారిపోతోందని, వ్యవసాయం ఆగిపోతే ఆహార ధాన్యాల కొరత వల్ల దేశంలో ప్రజలు కరువు, కాటకాలతో తిండిగింజలు లేక మాడిపోతారనే విషయాన్ని గ్రహించలేకపోతోంది. దీన్నొక సమస్యగా భావించడం లేదు. నిజానికి ఇది దేశ ప్రజలందరినీ ఒణికించే సమస్య" అన్నాడు రాజయ్య చివరిగా.

అదంతా వినగానే సూర్యనారాయణకు చెమటలు కమ్మాయి. భయంగా రాజయ్యను చూశాడు.

నిజమే. వ్యవసాయం లేనిరోజు దేశంలో మనుషులకు తిండిగింజలు ఎక్కడినించి వస్తాయి?

డబ్బుండి కొనుక్కోవాలన్నా ఒక దేశ ప్రజలందరికీ అవసరమైనన్ని తిండిగింజలు ఎక్కడ దొరుకుతాయి? ఉత్పత్తి ఏ విధంగా జరుగుతుంది?

ద్రవ్యోల్బణ పరిస్థితులు నెలకొంటాయి.

ఒకవేళ ఆహారధాన్యాలు దొరికినా బస్తాలతో డబ్బు తీసుకెళ్లి దోసిళ్ళలో తిండిగింజలను తీసుకోవలసిన ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడతాయి. కాటకం తాండవిస్తుంది. ఆకలి చావులు చెలరేగుతాయి. ఈ పరిస్థితిని ఎలా ఆపాలి? తిరిగి మామూలు పరిస్థితులు నెలకొని వ్యవసాయం యధావిధిగా జరిగేలా ఎలా చెయ్యాలి? ఇది కేవలం తనొక్కడివల్లా జరిగే పని కాదు. రైతులంతా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకోవాలి.

తగినంత భూమి వుండి దేశప్రజలు తిండిగింజలు లేక ఆకలితో చావకూడదు. తన వరకు తను తన కొడుక్కి నచ్చచెప్పి అతడి ఉద్యోగం మాన్పించి హైదరాబాదు నుండి ఆ పల్లెటూరికి వచ్చి- రాజయ్య పొలాన్ని తను కౌలుకి తీసుకుని తన కొడుకుతో కలసి వ్యవసాయం చెయ్యాలని అనుకున్నాడు సూర్యనారాయణ. అప్పుడు ముందు తన కుటుంబానికి అవసరమైన తిండి గింజలనైనా పండించుకోగలడు.

ఈ విషయాన్ని రాజయ్యతో చెప్పాడు.

అప్పుడు రాజయ్య "మీ పొలాన్ని మీరే తీసుకోండి...వ్యవసాయం చెయ్యనివాడికి భూమితో పనేమిటి? నాకు డబ్బు అవసరం లేదు. నేను, నా భార్య అమెరికా వెళ్ళిపోతాం" అన్నాడు చిన్నగా నవ్వి.

*(స్వాతి మాసపత్రిక డిసెంబరు 2009)*